# అమ్మాయి అదృష్టం

ముద్దంశెట్టి హనుమంతరావు

పోస్టుమేన్ యిచ్చిన వుత్తరాన్ని చించి చదువుకున్నాడు చలం. అతని ఆనందానికి అంతు లేకపోయింది. ముసిముసి నవ్వుతో వంటగదివేపు పోయాడు.

"ఏంవిటండీ! అంత సంతోషంగా నవ్వుతూ వస్తున్నారు? ఎక్కడినుండి వచ్చిన వుత్తరమది. అమ్మాయి దగ్గరినుండేనా?" చెయ్యి తుడుచుకుని యెదురుగా వస్తూ అంది భార్య కామాక్షి.

"అన్నమాటే-అల్లుడు వ్రాశాడు. ఈవాళ యెంత శుభదినమనుకున్నావ్. అంతా అమ్మాయి అదృష్టమే. అసలు చిన్నతనంలో ఓ జ్యోతిష్యుడు చెప్పనే చెప్పాడు, మనమ్మాయి అతీతమైన అదృష్టవంతురాలని. పండితుల మాటలు పక్వంకాకుండా పోతాయా?"

"ఉత్తరంలో సంగతులు చెప్పకుండా మీ ధోరణిలో మీరు పోతుంటే నాకేం అర్థమవుతుంది?" అంది కామాక్షి ఆపేక్షతో.

"ఇంకేంవిటీ...అల్లుడు గజపతికి ప్రమోషను దొరికిందట."

"అంటే...?" అర్థోక్తిలో తెల్లబోయి అడిగింది కామాక్షి.

"వెధవ నాగమ్మ—యేమీ తెలీదు...... వుద్యోగం పెద్దదయిందన్న మాట."

"అంతా నా చిట్టితల్లి అదృష్టమే! దాని ముఖం చూస్తేనే అర్థమౌతుంది. పెళ్ళయి ఆరు మాసాలయినా కాలేదు. అప్పుడే తార్కాణం కన్పించింది. ఏదీ ఇన్నాళ్ళయి వుద్యోగం చేస్తున్నాడాయన. ఆ వచ్చిన పెద్ద వుద్యోగమేదో మొదట రాకపోయిందీ! అతనికా అదృష్టం వుంటే కదూ! ఇంకేం వ్రాశాడండీ?"

"మనల్ని ఓసారి రమ్మన్నాడు. మనలో మన మనుకుందాం-యింత అదృష్టవంతురాల్ని వివాహము చేసుకోటానికెంత మూలిగాడు? ఇంతకూ బ్రహ్మరాత యిలావుంది. లేకపోతే మరొకరికా అదృష్టం పట్టేది. ఆడది అదృష్టవంతురాలైతే అందల మెక్కిపోతాడు మగాడు" అనేశాడేగాని నాలుక కర్చుకున్నాడు మధ్యలో చలం.

"ఆ నిదర్శనం మన దాంపత్యంలో ప్రత్యక్షంగా కనుపిస్తుంది కదండీ!"

"అంటే నీ వుద్దేశం?" అసూయతో అడిగాడు చలం.

"నేను రాకపూర్వం మీకుమాత్రం ఏముండేది? మామూలు ముప్ఫయిరూపాయల వుద్యోగమేగా. యీ యిల్లు, యీ సామాన్లు అన్నీ నేనొచ్చేక కొన్నవే. యిప్పటికీ మావాళ్లు కొందరంటుంటారు నేను చాలా అదృష్టవంతురాలనని."

"ఔను మరి! నీవల్లే నాకీ అభివృద్ధి కలిగింది. నువ్వేమో గొప్ప అదృష్టవంతురాలవు. నేను మట్టిబొమ్మను. నిన్ను వివాహం చేసుకోకపోతే నాకీ ఔన్నత్యం వుండదంటావు. అంతేనా?"

"అనటమేమిటి-పచ్చి సత్యమది. నన్ను మీరు వివాహం చేసుకోపోతే మీ జీవితాధ్యాయం మరో పంథాలో నడిచేది" అని కామాక్షి అనటంతో చలంకు చెప్పరాని కోపం కలిగింది.

భార్యమాటలు అతన్ని విసిగించి, వుడికించినయ్. ఆమె యెప్పుడూ తనదే ఆధిక్యతం అ… వాదించటం అతనికి క్రొత్తకాదు. ఆమె వుద్దేశం మగవారు వట్టి మట్టిబొమ్మలని, వారి కసలు అదృష్టరేఖ లేనేలేదని. అందుకు కారణం… పూర్వులు, వారి ఆచారాలు. ప్రతి కుటుంబం… లోనూ, మగవాడికి వివాహమైన తరువాత వృద్ధిలోకి వస్తే భార్య అదృష్టమనీ, పతనమైతే భార్య అభాగ్యురాలని విమర్శిస్తుంది మన సంఘం. సంఘం దృష్టిలో మగవాడో మట్టి బొమ్మ.

"నువ్వు మర్చిపోయావు గామోసు కామాక్షి గతించిన జీవితంలోని మరువలేని సన్నివేశాలు నువ్వు మాయింట్లో కాలిడిన తరువాత యెన్ని అనర్థాలు సంభవించాయ్? ఎన్ని యిక్కట్లకు గురయ్యాం? అప్పుడు మావాళ్లు నిన్నెన్నిసార్ల

చీవాటు పెట్టలేదు? అవన్నీ నెమరేసుకో. ఓసారి నిజం చెప్పుకోవాలంటే నా విషయంలో నాదే అదృష్టం" ఉద్రేకంగా అన్నాడు చలం.

భర్త ఉద్రేకం కామాక్షిని భయపెట్టింది. జరిగిపోయినదానికై తర్కవితర్కాలను పెంచుకోవటం లాభం లేదనుకుంది.

"సరే! ఒప్పుకున్నాలెండి—మీ అదృష్టమే."

"అలా దారికిరా. అంతేగాని తను పట్టిన కుందేటికి మూడేకాళ్లన్నట్టు అడ్డువాదన చెయ్యకు. మన అమ్మాయి విషయంలో అన్నావూ—దానిదే అదృష్టం."

"అయితే ఎప్పుడు బయలుదేరుదాం? మూడు నెలలయింది చిట్టితల్లి ముఖం చూడలేదు. ఎంత అక్క అయిపోయిందో అందులోనూ అత్తవుండే మహాచెడ్డది. కోడళ్ళను కొరుక్కుతింటుందట. గజపతికి వేలువిడిచిన అక్కచెల్లెలుందిగాని, దాని సంగతి అంతగా తెలీదు."

"రెండుమూడు దినాల్లో వెళ్ళటానికి ప్రయత్నంలో వుండు. అల్లుడుకి ప్రమోషను దొరికినప్పుడా శుభసమయంలో మనంకూడా యెందుకుండకూడదూ?" అంటూ వుత్తరం టేబిలుమీద పెట్టి తనదారిన తను పోయాడు.

చలం మొదట గుమస్తాగిరీలో ప్రవేశించి స్వశక్తివల్ల హెడ్‌గుమాస్తా అయ్యాడు. తనక్రింద పనిచేస్తుండేవారందరికి చలం అంటే యెంతో అభిమానం. ఆఫీసరు ఆదరాభిమానాలు బాగా సంపాదించుకున్నాడు. ఒక్కమాటలో చెప్పాలంటే చలం చాలామంచివాడు. ఒక్క లోపం మాత్రం అతనిలో కనుపిస్తుంది—ఎప్పటో తప్పిస్తే సాధారణంగా భార్య చెప్పినమాటకు తలఒగ్గే మనిషి. (యిప్పుడు చాలమందికీ అలవాటు వుండేదేగా)

అనుకున్నట్టు చలానికి శెలవుదొరికింది. భార్యాభర్తలిరువురూ బయలుదేరారు.

కామాక్షి రైలుబండిలో కూర్చున్నంతసేపూ కూతురు ఆలోచనలే. కూతురు యింట్లో అడుగు పెట్టినతరువాత అల్లుడికి పెద్దపని అవ్వటం ఆ యింట్లోవారందరూ కూతుర్ని యెంతో మెచ్చుకుంటుంటారనుకుంది కామాక్షి తనలో. చలం ఒకటే ధ్యాసతో వార్తాపత్రిక చదువుకుంటున్నాడు. వారు కూర్చున్న బెంచీకి యెదురుగా మరోయిద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటున్నారు. హఠాత్తుగా కామాక్షి చలం చెవులపడ్డయ్. ఆ మాటలు "అదృష్టమంటూ యెక్కడా లేదోయ్. ప్రయత్నానికి మారుపేరు అదృష్టం" అన్నాడొకాయన.

"అయితే అదృష్టమంటూ యెవ్వరికీ వుండదంటావు?"

"గాలిలో దీపం పెట్టి భగవంతుడిదే భారమని వూరుకుంటే ఆరిపోకుండా వుంటుందా?"

"దీపం ఆరిపోకుండా యేదేనా అడ్డు పెడితే?"

"ఆఁ! దాన్నే ప్రయత్నమంటారు. ప్రయత్నంలేందీ అదృష్టం కల్సిరాదు. నువ్వన్నదికూడా పూర్తిగా ఖండించలేను. అదృష్టానికి బదులు అవకాశాలు లభించాలంటే బావుంటుంది."

వాదన ముగియకుండానే వాళ్లు దిగదలచుకున్న స్టేషను రావటంతో ఇరువురు దిగిపోయారు.

"విన్నావా కామాక్షి వాళ్ళ వాదన?"

"ఆఁ! విన్నా....అంత మొండివాదన వాదిస్తే యెవరేం చెయ్యగలరు?

"పోనీలే-మనకెందుకీ లేనిపోనితగవు. స్టేషను దగ్గర పడుతోంది. సామాన్లు సర్దు" కిటికీనుండి తొంగి చూస్తూ అన్నాడు.

అలసిపోయిన పొగబండి ఆగింది. కూలీచే సామాన్లు పట్టించుకుని దంపతులు బయటకు పోయారు. వీలైనంత తొందరగా పోవాలని కామాక్షి వాంఛ. కాని మానవ వాంఛలు మనసులోనే వుండి పోతుంటయ్ అప్పుడప్పుడు. అప్పటికే బస్సులో మనుషులు కూరుకుపోయారు. నిల్చుదామన్నా జాగాదొరకలేదు. రెండోబస్సు వచ్చినంతవరకు వుండవలసి వచ్చినందుకు కామాక్షి కోపం కట్లుతెగి ప్రవహించింది. యింతకూ యెవరిమీద ఆక్రోశం?

రెండోబస్సులో నిల్చుని యెలాగో గమ్యస్థానం చేరుకొన్నారు. ఇంటిముందు గజపతి నిల్చుని సిగరెట్టు కాల్చుకుంటున్నాడు. అత్తమామల్ని చూచి లాంఛనరీతి పలుకరించాడు. కామాక్షి, కూతురు విజయ యెదురుగావచ్చి కౌగలించుకుంటుందని కలలు కంది. కాని అలా జరుగలేదు. బెదురు చూపులతో నలువేపుల కలయజూచింది కామాక్షి. కూతురెక్కడా కని

పించలేదు. యిట్లోకి పోతూ "విజయ యేది నాయనా? అండివుండలేక. "అమ్మకు జ్వరం తీవ్రంగా వుంది. అక్కడవుండి వుంటుందత్తా" జవాబిచ్చాడు" గజపతి సిగరెట్టుకుని పారేస్తూ, దంపతులు మొఖాలుచూసుకుని లోపలికినడిచారు.

మంచంప్రక్కన గజపతి అక్కయ్య, విజయ కూర్చునారు. గజపతి అన్నయ్య వెంకటేశం కొద్దిదూరంలో కుర్చీలో కూర్చున్నాడు. అందరి ముఖాల్లోనూ విషాదరేఖలు కన్పించాయి. అతీతమైన ఆనందంతో కూతుర్ని చూడాలని, ప్రమోషను దొరికిన అల్లుడి ఆనందం తామూ పంచుకుందామని ఆశతోవచ్చిన ఆ దంపతుల శరీరాలు చల్లబడినయ్, ఆదృశ్యంచూచి వెంకటేశం మాత్రంలో గొంతుకతో పరామర్శ చేశాడు.

"డాక్టరేమన్నాడు వెంకటేశం?" అడిగాడు చలం "ఇప్పుడు కొంత నయమయ్యే మార్గంలో పడిందన్నాడు లెండి! ఇన్నాళ్లు జీవితంలో యెప్పుడూ ఇలాలేదండి. వుక్కు ముక్కలాంటి అమ్మకు ఇప్పుడీజ్వరం గట్టిగా పట్టింది." అంటూ వెంకటేశం బయటకు పోయాడు. చలం, ఆతని మాటల్లోని అంతరార్థం అర్థం చేసుకోలేక భార్య వేపు జూశాడు. కామాక్షికూడా తెల్లబోయింది. గజపతి అక్కయ్య (విధవ) గ్రుడ్లురుముతూ యేమేమో లోపల గొణుక్కొంటూ పోయిందక్కడినుండి. విజయ నీరసంగా పాలిపోయిన ముఖాన్ని తల్లివేపు త్రిప్పింది. కామాక్షి కన్నీరు కారుస్తూ కూతురు తల నిమురుతూంది. చలం కుర్చీలో కూర్చున్నాడు. కొంతసేపు నిశ్శబ్దం—

"ఏం అమ్మాయీ! ఇలా నీరసించిపోయావ్? ఎప్పుడూ కళకళ లాడుతుండే ముఖం కాంతి లేకుండా పోయిందేమే? నిజం చెప్పుతల్లీ!!" అని కామాక్షి అంటుంటే చలం కూడా దగ్గరగా కుర్చీ లాక్కోబోయాడు. కాని విజయ తల్లిని తీసుకుని తండ్రిదగ్గరగా పోయింది.

మంచంపై గజపతి తల్లి నిద్రపోతోంది. ఇల్లాంతా నిశ్శబ్దంగా వుంది. కారణంలేకండా విజయే కంటతడి పెట్టుకుంది.

"ఎందుకమ్మా యేడుస్తావ్? యేం జరిగిందో చెప్పు" అన్నాడు చలం లాలనగా.

"...మొన్నటివరకు అత్తయ్య ఆరోగ్యంగానే వుండేది నాన్నా! ఆమె మంచం పట్టింది మొదలు ఇంట్లోవాళ్ళు, యిరుగుపొరుగు వాళ్ళూ వూసులేసుకొని మాతులు విరుచుకుంటున్నారు నేను ఇంట్లో అడుగు పెట్టానోలేదో, అత్తమంచమెక్కిందని అందరికంటె మావదిన లేదూ, ఆవిధవావిడ...మరీ ప్రచారంచేస్తుంది...అందరినోట నా మాటే..." అంటూ వెక్కివెక్కి యేడ్వటం మొదలెట్టింది.

అమ్మాయి అదృష్టం గురించి తీవ్రంగా వాదించుకున్నా దంపతులు చిత్తయిపోయారు. ఆమె అదృష్టంవల్లనే అల్లుడికి ప్రమోషను దొరికిందని యెంతో ఆనందించారు. కాని యిక్కడికి రావటంతో కథ అడ్డంతిరిగింది. చలం, కామాక్షి కొద్దిసేపటివరకు మాట్లాడలేదు. చివరకు చలం అందుకున్నాడు.

"అత్త అనారోగ్యానికీ, కోడలికీ యేం సంబంధమమ్మా?"

"ఏమో నాన్నా! అంతా అదేమాట..!!"

"అంతా వట్టి దద్దమ్మలు, మరి, మీ ఆయనేం అంటాడు"

"ఆయన యెవ్వరికీ జవాబు చెప్పకండా మౌనంగా కాలం పుచ్చుతున్నారు. ఒకవేళ ఏమన్నా, వారి అక్కచెల్లెలువూరుకుంటుందా?"

"మరి నువ్వొచ్చిన తరువాతనేగా మీఆయనకి పెద్ద వుద్యోగమయింది. అది నీ అదృష్టమని యెవరూ అనరూ?" అంది మధ్యలో తల్లి

"పోనీఅమ్మా! మనకవన్నీ యెందుకు? కారణం లేకండా నన్నెందుకిలా నిందలపాలు చేస్తున్నారు? అత్తమీద నాకేం పగా? అయినా యెందుకో వాళ్లందరికీ నా మీద కారణంలేని కార్పణ్యం—"

"నువ్వేమీ దిగులుపడకమ్మాయీ! నేను గజపతితో మాట్లాడుతాలే. అవసరమైతే యిక్కడి నుండి ట్రాన్స్ఫర్ చేసుకోమంటా. మూఢనమ్మకాలుగాని, అత్తరోగానికి నువ్వెలా కారకురాలౌతావు?" అని కూతుర్ని ఓదార్చి చలం భార్యవైపు తిరిగాడు.

"చూశావుటే! యిప్పుడర్థమయిందా యెవరి అదృష్టమో? మనం అనుకుంటాం మన అమ్మాయి అదృష్టమని. వాళ్ళు దీనికి వ్యతిరేకంగా అభిప్రాయ పడుతుంటారు." అంటూంటే గజపతి వచ్చాడు. ఆ సంభాషణ అంతటితో ఆపారు.